

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## 8న కల్వకుర్తికి కేటీఆర్ రాక

కల్వకుర్తి, మే 5 : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు ఈనెల 8న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ కల్వకుర్తికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏర్పాట్లను పరిశీలించారు. మినీ స్టేడియంలో హెలీప్యాడ్ స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ గోవర్ధన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మనోహర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.






# ఊసరవెల్లినే నయం

- నీలాగా ఎవరూ రంగులు మార్చలేరు..
- బాధ్యతారహితంగా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి
- ఏ సీఎం ఇంత దిగజారుడు మాటలు మాట్లాడలే..
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మే 5 : నాడు టీడీపీలో ఉన్న సందర్భంలో కాంగ్రెస్ నాయకురాలిపై ఎంతనీచంగా మాట్లాడావో ప్రజలకు గుర్తున్నదని, ఇప్పుడు అదే కాంగ్రెస్‌లో చేరి సోనియమ్మ దేవత, రుణం తీర్చుకుంటామని బీరాలు పలుకుతుండడం చూసి, ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. నీలాగా ఎవరూ రంగులు మార్చలేరన్నారు. ఆదివారం తన నివాసంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బైకాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్‌తో కలిసి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి ఓ సీఎంగా ఉండి రేవంత్‌రెడ్డి బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని, కేవలం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రెండు సార్లు సీఎంగా పనిచేసిన, వయస్సులో నీకన్నా 20ఏండ్లు పెద్దవారు అన్న ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడం దారుణమన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు ఏ సీఎం, మంత్రులు కూడా రేవంత్‌లా ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేసిన దాఖలాలు లేవన్నారు. దక్షిణాదిలో ఏ పార్టీ కూడా మూడుసార్లు అధికారంలో ఉన్న దాఖలాలు లేవని ఇక్కడి ప్రజలు రెండు సార్లు ఇచ్చిన అవకాశం మూడో సారి ఇతర పార్టీలకు ఇస్తుంటారన్నారు. అదేకోణంలో తెలంగాణ ప్రజలు ప్రభుత్వ వ్యతిరేకతతో కేవలం 1:8 శాతం ఓట్లతో కాంగ్రెస్‌కు అవకాశం కల్పించారన్నారు. ఇంకా తెలంగాణలో ప్రజలు బీఆర్‌ఎస్ వైపై ఉన్నారని, వచ్చే పార్లమెంట్‌లో అత్యధిక స్థానాలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలువబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు నీకు ఇచ్చిన అధికారాన్ని ప్రజల అభివృద్ధికి కేటాయించాల్సిపోయి, ఒక డిక్టేటర్‌గా వ్యవహరిస్తూ నిత్యం ఏ మీటింగ్‌లో కానీ, సభలో కానీ, సమయం, సందర్భం లేకుండా మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే పరమావధిగా పెట్టుకున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తి కావస్తున్నా సీఎం నోరు మెదపడం లేదన్నారు. గత ప్రభుత్వం లక్ష ఉద్యోగాలను భర్తీ చేసి ఎన్నికల కన్నా ముందే మరో 36 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి రాత పరీక్షలను కూడా నిర్వహించిందని, ఎన్నికల అనంతరం ప్రభుత్వ మార్పు జరిగిందని, గత ప్రభుత్వ ఉద్యోగాలను తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుమాలిన చర్య అన్నారు. నాడు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో జీవో నెం.46తో మొత్తం ఏమో జరిగిపోతుందని యువకులను పెడదారి పట్టించారని, ఇప్పుడు మీ ప్రభుత్వం వచ్చినా దానిని ఎందుకు రద్దు చేయడం లేదో యువతకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎప్పుడూ మహబూబ్‌నగర్ బిడ్డను అని చెప్పుకునే నువ్వు 90 శాతం పూర్తయిన పాలమూరు–రంగారెడ్డిని పూర్తి చేసి సాగు నీరందించాలని సవాల్ విసిరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక దేవుళ్లపై ఒట్టు వేస్తూ కాలయాపన చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. యాసంగి పోయి.. మళ్లీ వానకాలం సీజన్ మొదలు కాబోతుంది, ఇప్పటివరకు రైతుబంధు లేదన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు కోసం రూ.7,500 కోట్లు సిద్ధం చేస్తే ఎన్నికల పేరుతో అడ్డంకులు సృష్టించింది మీరు కాదా ? అని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాల్సిన డబ్బులను మీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించుకున్నారని మండిపడ్డారు. కృష్ణానది పరీవాహక ప్రాజెక్టులను ట్రిబ్యునల్‌కు అప్పజెప్పకుండా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, మీరొచ్చిన వెంటనే అప్పనంగా అప్పజెప్పిన విషయం వాస్తవం కాదా అన్నారు. కేంద్రం గోదావరి మీద కావేరిని అనుసంధానం చేసే ప్రయత్నాన్ని గత ప్రభుత్వం తిరస్కరిస్తే అప్పనంగా అప్పజెప్పేందుకు బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. దేశంలో మళ్లీ మోదీ ప్రభుత్వం వస్తే హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేసేందుకు కూడా కాంగ్రెస్ సీఎం సహకరిస్తున్నాడన్నారు. సీఎం హోదాలో విధానపరమైన విమర్శలు చేస్తే తప్పు లేదు, కానీ వ్యక్తిగత విమర్శలు చేసి ఇతరుల మనోభావాలు దెబ్బతీయకూడదని హితవు పలికారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులు లక్ష్మయ్య, కురుమూర్తియాదవ్, పరంజ్యోతి, శేఖర్‌నాయక్, ధర్మనాయక్, బాలపీరు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు

# త్వరలో కూలనున్న కాంగ్రెస్ సర్కారు

- హామీల అమలులో నానా తంటాలు : ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలి : ఎమ్మెల్యే విజయుడు

వడ్డేపల్లి, మే 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడానికి నానా తంటాలు పడుతున్నదని, పరిపాలన చేతగాని ఈ ప్రభుత్వం త్వరలోనే కూలుతుందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం శాంతినగర్‌లో రాజోళి, వడ్డేపల్లి మండలాల బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథులుగా అలంపూర్ ఎమ్మెల్యేతో కలిసి ఎమ్మెల్సీ చల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాము ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, గతంలో అమలులో ఉన్న రైతుబంధు, కల్యాణలక్ష్మి లాంటి పథకాలను కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కేవలం 4వేల చిలుకు ఓట్లు పడ్డాయని ఈసారి పెరిగితే మరో నాలుగువేల ఓట్లు పెరగవచ్చుని, బీజేపీ మనకి పోటీయే కాదని, కాంగ్రెస్‌ను నమ్మవద్దని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో తాగునీరు, కరెంటు ఇబ్బందులు ఉండేవికావని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేతకావడం లేదని, పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అనంతరం బీఎస్పీకి చెందిన యాభైమంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణమ్మ, మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, రాజోళి వైస్‌ఎంపీపీ రేణుక, సహకార సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రాజోళి మండల పార్టీ అధ్యక్షుడు పచ్చర్ల శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నేతలు

శాంతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన బీఎస్పీ నాయకులు ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీఎస్పీ అలంపూర్ తాలూకా ప్రధాన కార్యదర్శి రవిచందర్, బూత్‌కమిటీ అధ్యక్షులు, ముఖ్యకార్యకర్తలు లక్ష్మన్న, వెంకటేశ్, హనుమంతు, నర్సన్న, ఆదాం, రాజారావు తదితరులు ఉన్నారు.



## కేసీఆర్‌ను తిట్టడమే రేవంత్ పనా..?

కేసీఆర్‌ను తిట్టడమే రేవంత్ పనా..? అందుకోసమే సీఎం అయ్యాడా ? రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూట గట్టుకున్నది. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రయోజనాల కోసం నిత్యం శ్రమించి రైతులు, మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చారు. 24 గంటల కరెంట్, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో ఉన్న ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదు. పైగా తెలంగాణకు వచ్చే నిధులను కూడా అడ్డుకున్నది. ఎంపీగా ఆశీర్వదిస్తే.. అందుబాటులో ఉండి మీకు సేవ చేస్తా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా హామీలను అమలు చేయడం లేదు. ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నా రేవంత్ సర్కారు పట్టించుకోవడం లేదు.

*- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ*

కోస్గి పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ నేతలు

# తెలంగాణ ప్రయోజనాలు బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

- రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి చేసింది కేసీఆరే..
- వంద రోజుల్లోనే కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత
- ఆలయాలు, అక్షింతల పేరిట బీజేపీ రాజకీయం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె

కోస్గి, మే 5 : తెలంగాణ అన్నింటా అగ్రగామిగా ఉండాలన్నా, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలన్నా అది బీఆర్‌ఎస్ పార్టీతోనే, కేసీఆర్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం కోస్గిలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నో కష్టనష్టాలకు గురైందని తెలంగాణ తల్లి విముక్తి కోసం పోరాడి తెలంగాణ సాధించింది బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అనే.. అదే విధంగా పదేండ్ల పాటు బంగారు తెలంగాణగా అభివృద్ధి చేసిన ఘనత కూడా ఆయనకే సొంతం అన్నారు. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన వంద రోజులు గడిచినా హామీలు అమలు చేయడం లేదని, దీంతో అప్పుడే ఈ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని గుర్తు చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్‌ఎస్ మధ్య పోటీ ఉందన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం సెంటిమెంట్‌తో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇంటింటికీ అక్షింతలు పంపించి ఓట్లు అడుగుతున్నారన్నారు. రామమందిరం నిర్మాణం ప్రజలు ఏర్పాటు చేసిన ట్రస్టుతో నిర్మించబడిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెడుతూ ఓట్ల రాజకీయం చేస్తోందని ఆరోపించారు. దేశంలో ఏ నాయకుడైనా గట్టిగా మాట్లాడితే బీజేపీ ప్రభుత్వం గొంతు నొక్కుతుందన్నారు. పార్లమెంటులో తెలంగాణ గురించి మాట్లాడిన నాయకుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి అని, ఆయన ఐదేండ్లు ఎంపీగా ఉండి 358 ప్రశ్నలు అడిగారని గుర్తు చేశారు.

***రేవంత్ రాజీనామా చేస్తావా..? : పట్నం నరేందర్‌రెడ్డి***

పాలమూరు ఎంపీ అభ్యర్థి ఓడిపోతాడన్న ఇంటలిజెన్స్ రిపోర్ట్స్‌తో కొడంగల్‌లో 5 సార్లు ముఖ్యమంత్రి హోదాలో పర్యటించారని, కొడంగల్ నుంచి 50వేల మెజార్టీ వస్తుందని రేవంత్‌రెడ్డి చెబుతున్నాడు, 50వేల మెజార్టీ రాకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా అని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోస పడుతున్నారని, కరెంట్ లేక మోటర్లు కాలిపోయి పంటలు ఎండిపోయి ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆత్మహత్యలు లేని తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యమని, అందుకే ఎంపీగా మన్నెను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కొడంగల్ ఎన్నికల ఇన్‌చార్జి అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ, నాయకులు మైపాల్, సలీం, బాల్‌సింగ్‌నాయక్, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.



కారు గుర్తుకు ఓటేయాలని వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కాంగ్రెస్‌కు గ్యారెంటీ లేదు..

- పెంచిన పింఛన్ లేదు, తులం బంగారం ఇవ్వడం లేదు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 5 : ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల తర్వాత ఉంటుందన్న గ్యారెంటీయే లేదని, ఇక ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా మాజీ మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయి గోసపడుతున్నామని, మరోసారి అలా మోసపోవద్దని సూచించారు. మహబూబ్‌నగర్‌తో పాటు రాష్ట్రం బాగుండాలంటే ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని, అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చూపించాలని పిలుపునిచ్చాడు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో పెంచిన పింఛన్ ఇవ్వడం లేదని, ఆడ పిల్లల పెండ్లికి తులం బంగారం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. 2014 కంటే ముందు మహబూబ్‌నగర్ ఆ తరువాత 9 ఏండ్లలో జరిగిన అభివృద్ధి చూడండని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఏనుగొండను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిస్తే స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసే అవకాశం ఉందని అందుకే మన్నెను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీలను గాలికొదిలేసిన ప్రభుత్వం

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, మే 5 : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు గాలికొదిలేసిందని, మరోసారి కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతామని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జడ్చర్లలోని నిమ్మబావిగడ్డ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అలవికాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు నిమ్మబావిగడ్డ ప్రాంతంలో మహిళలు ఎంపీ అభ్యర్థి మన్నెకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



జడ్చర్లలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

# ఒక్క హామీనీ అమలుచేయడంలేదు

- ఐదు గ్యారెంటీల పేరిట మరో మోసానికి తెర : ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



కాంగ్రెస్ కార్యకర్తలకు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 5 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గద్వాల మున్సిపాలిటీలో 2,3,6,9 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకొని నడగడ్డను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. గత ప్రభుత్వాల కాలంలో గద్వాల మున్సిపాలిటీకి రూ.5 కోట్లులేదా రూ.10కోట్ల నిధులు మాత్రమే వచ్చేవన్నారు. కేసీఆర్ హయాంలో రూ.100 కోట్లు ఇచ్చారని, వాటితో గద్వాలను ఎంతగానో అభివృద్ధి చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఫ్రీ బస్ తప్పా ఏదీ ఇప్పటి వరకు అమలు చేయలేదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే రుణమాఫీ చేస్తామని చెప్పి దీనిపై ముఖ్యమంత్రితోపాటు మంత్రులు రైతులకు ఇప్పటి వరకు స్పష్టమైన హామీ ఇవ్వలేక పోతున్నారన్నారు. చాలా మందికి రైతుబంధు రాలేదని.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కోసం పేద ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఐదు గ్యారెంటీలు అంటూ మరోసారి ప్రజలను మోసం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని వారి మాటలు ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నాయకులు మతం,ధర్మం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కులం, మతం పేరుతో రాజకీయాలు చేసే బీజేపీని ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అంతకుముందు 9వ వార్డుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు లక్ష్మీనర్సమ్మ, మురళి, నాగలత, నాగిరెడ్డి, నరహరిశ్రీనివాసులు, దౌలు, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వేణుగోపాల్, సాయిశ్యాంరెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం గొడవ

- పైపులు పగులగొట్టిన మహిళలు

బల్మూరు, మే 5 : తాగునీటి కోసం గొడవపడి బోరు మోటరు, స్టార్టర్, పైపులైన్‌ను పగులగొట్టిన ఘటన ఆదివారం మండలంలోని పోలిశెట్టిపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామంలో కొద్దిరోజుల నుంచి తాగునీటి సమస్య ఉన్నది, ఈ సమస్యను అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఆదివారం ఉదయం గ్రామంలో ఎస్సీ కాలనీ, పోచమ్మ ఆలయం దగ్గర ఉన్న బోరుమోటర్ దగర నీళ్ల కోసం పెద్ద ఎత్తున గొ డవ పడి పైపులు పగులగొట్టారు. తాగునీటి సమస్య తీవ్రం గా ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అ ధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



గ్రామస్తులు పగులగొట్టిన స్టార్టర్, పైపులు


